RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ
సంపుటి: 4 సంచిక:110 | ఏప్రిల్ 19, 2026 | వెల: రూ.3-00 | సీఎండీ & ఎడిటర్
9701923260



నాచారం పారిశ్రామిక వాడలో
## భారీ అగ్నిప్రమాదం


2లో



జగిత్యాల నుంచే
## జైత్రయాత్ర

- రాష్ట్రంలో రాజకీయ పునరేకీకరణ జరుగుతోంది
- బీఆర్ఎస్‌కు మళ్లీ భారీ మద్దతు లభిస్తున్నది
- కేసీఆర్ సభకు భారీ ఏర్పాట్లు
- గులాబీ దళపతి ప్రసంగం కోసం జనం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు
- లక్షలాది ప్రజల సమక్షంలో సభ విజయవంతం అవుతుంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో




మూడేళ్లలో రూ. 4,724 కోట్లు దోచేశారు

3లక్షలకుపైగా ఫిర్యాదుల

# తెలంగాణపై సైబర్ పంజా!

- డిజిటల్ విప్లవం.. నేరగాళ్లకు వరం
- చదువుకున్న వారు, ఉన్నతోద్యోగులు, రిటైర్డ్ ఎంప్లాయీసే బాధితులు
- ప్రజా ప్రతినిధులు సైతం కేటుగాళ్ల వలకి..
- వినూత్న వ్యూహాలతో బురిడీ
- జీవితకాల సంపాదన క్షణాల్లో మాయం
- సైబర్ నేరాలపై అవగాహన అవసరం అంటున్న నిపుణులు
- అపరిచిత లింకులు, ఆఫర్లతో జాగ్రత్త అంటూ పోలీసుల హెచ్చరిక
- సైబర్ క్రైం జరిగితే గోల్డెన్ అవర్స్ చాలా కీలకం

2లో

**వేద న్యూస్, క్రైం బ్యూరో**

నగదు రహిత లావాదేవీల్లో మన రాష్ట్రం దూసుకుపోతుంటే, అదే వేగంతో సైబర్ నేరగాళ్లు మన ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. కేవలం మూడేళ్లలో రూ. 4,724 కోట్లు కొల్లగొట్టారంటే పరిస్థితి ఎంత భయానకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు, రిటైర్డ్ ఉద్యోగుల నుంచి ఎమ్మెల్యేల వరకు ఎవరినీ వదలని ఈ డిజిటల్ గ్యాంగ్ కొత్త వ్యూహాలతో విరుచుకుపడుతోంది. లింక్ క్లిక్ చేస్తే చాలు.. జీవితకాల సంపాదన ఆవిరి! డీప్‌ఫేక్ టెక్నాలజీ, కేవైసీ మోసాలు, న్యూడ్ కాల్స్ బ్లాక్ మెయిలింగ్ వంటి వినూత్న పద్ధతులతో ప్రజలను ఉచ్చులోకి లాగుతున్నారు. అసలు ఈ సైబర్ మాయాజాలం ఎలా జరుగుతోంది? తెలంగాణ పోలీసులు హెచ్చరిస్తున్న ఆ 'గోల్డెన్ అవర్స్' ప్రాముఖ్యత ఏంటి? మీ కష్టార్జితం సైబర్ నేరగాళ్ల పాలు కాకుండా ఉండాలంటే మీరు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'వేద న్యూస్' ప్రత్యేక కథనం..



## క్రాస్‌బ్రీడ్ బంధం

- బీజేపీ పెద్దలతో సీఎం సంబంధాలు
- కేంద్రమంత్రి ఇంట్లో రేవంత్ రెడ్డి భోజనం
- రాజకీయంగా పారదర్శకత అవసరం
- రేవంత్‌పై హరీశ్ రావు విమర్శలు



2లో

# డీలిమిటేషన్ పేరుతో బీజేపీ కుట్రలు చేస్తోంది

- దక్షిణాది రాష్ట్రాల మద్దతు కోసం ముందుకు వస్తాను
- మహిళా సాధికారతపై కట్టుబడి ఉన్నాం
- కాంగ్రెస్ పార్టీకి రాజకీయాల కంటే దేశమే ముఖ్యం
- సీఎం రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, నేషనల్ డెస్క్**

మహిళా రిజర్వేషన్ బిల్లుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విస్తృత వ్యాఖ్యలు చేశారు. 2023 నాటి మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడితే దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలోపు మహిళా రిజర్వేషన్లను అమలు చేస్తే తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేతలను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన రేవంత్ రెడ్డి, 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోవడాన్ని దేశ ప్రయోజనాల దృష్ట్యా ఒక ముఖ్య పరిణామంగా

మిగతా 2వ పేజీలో



# ఎండ.. ప్రచండం

- 44.6 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రతలు
- రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత
- ఉదయం నుంచే భానుడి బీభత్సం
- కొమురంభీమ్ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత
- ప్రజలకు జాగ్రత్తలు సూచించిన వాతావరణ శాఖ



**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజు రోజుకు పెరుగుతూ ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉదయం తొమ్మిది గంటల నుంచే బయటకు రాలేని పరిస్థితులు నెలకొనడంతో ప్రజలు ఉక్కపోతను అనుభవిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం కొమురంభీమ్ జిల్లాలోని కెరమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల

మిగతా 2వ పేజీలో

వేద న్యూస్

ఆదివారం | ఏప్రిల్ 19, 2026

# తెలంగాణపై సైబర్ పంజా!

**వేద న్యూస్, క్రైం బ్యూరో**

ప్రపంచం అంతా డిజిటల్ మయం అయిపోయింది. తెలంగాణలో డిజిటల్ కరెన్సీ వాడకం విపరీతంగా పెరిగింది. పల్లె నుంచి పట్నం వరకు చిన్న కరివేపాకు కట్ట కొన్నా డిజిటల్ పేమెంట్ చేసే స్థాయికి మనం చేరుకున్నాం. అయితే, ఇదే సాంకేతికత సైబర్ నేరగాళ్లకు వరంగా మారింది. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్స్ వాడుతున్న సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు ప్రతి ఒక్కరూ ఇప్పుడు నేరగాళ్ల డేంజర్ జోన్లో ఉన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, మెయిల్స్ ద్వారా వచ్చే ఒక చిన్న అపరిచిత లింక్, మీ జీవితకాల సంపాదనను క్షణాల్లో మాయం చేస్తోంది.



### మూడేళ్లలో మూడు లక్షల ఫిర్యాదులు

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో వెల్లడించిన గణాంకాలు చూస్తే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది. 2022 నుంచి 2026 ఫిబ్రవరి వరకు రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షలకు పైగా సైబర్ ఫిర్యాదులు అందగా, అందులో 76,048 కేసులు నమోదయ్యాయి. ఈ కాలంలో నేరగాళ్లు ప్రజల నుంచి సుమారు రూ. 4,724 కోట్లు దోచుకోవడం గమనార్హం. కేవలం నిరక్షరాస్యులే కాదు, రిటైర్డ్ ఉద్యోగులు, ఉన్నతాధికారులు, చివరికి ప్రజా ప్రతినిధులు (ఎమ్మెల్యేలు) సైతం ఈ సైబర్ కేటుగాళ్ల వలలో చిక్కి లక్షలు పోగొట్టుకుంటున్నారు.

### వినూత్న వ్యూహాలు

రాష్ట్రంలో నమోదవుతున్న సైబర్ నేరాల్లో అత్యధికం పట్టణ ప్రాంతాల్లోనే జరుగుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో కేసుల సంఖ్య భారీగా ఉంది. నేరగాళ్లు కేవలం ఆర్థిక లావాదేవీలకే పరిమితం కాకుండా, న్యూడ్ వీడియో కాల్స్, డీప్‌ఫేక్ టెక్నాలజీని వాడుతూ బ్లాక్ మెయిల్ చేయడానికీ వెనుకాడటం లేదు. గౌరవ మర్యాదలకు భయపడి చాలా మంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం నేరగాళ్లకు మరింత కలిసొస్తోంది.

### ఆకర్షణీయమైన ఆఫర్ల పేరుతో..

పండుగలు లేదా ప్రత్యేక రోజులను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. సర్ప్రైజ్ గిఫ్ట్, ఉచిత రీఛార్జ్, భారీ డిస్కౌంట్ అంటూ పంపే లింకులు క్లిక్ చేయగానే ఫోన్‌లోకి మాల్వేర్ ప్రవేశిస్తోంది. దీనికి తోడు ప్రస్తుతం డీప్‌ఫేక్ టెక్నాలజీతో ప్రముఖుల ముఖాలను వాడి నకిలీ వీడియోలను సృష్టిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇలాంటి కంటెంట్‌ను షేర్ చేయడం కూడా నేరమేనని, గ్రూప్ అడ్మిన్లు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

### బ్యాంకింగ్ మోసాలు.. కేవైసీ పేరిట వంచన

మీ బ్యాంక్ ఖాతా బ్లాక్ అయింది లేదా కేవైసీ అప్‌డేట్ చేయాలి అంటూ వచ్చే ఫేక్ మెసేజ్‌లతో ప్రజలను భయపెట్టడం నేరగాళ్ల ప్రధాన ఆయుధం. ఈ క్రమంలో వారు అడిగే ఓటీపీ లేదా పిన్ నంబర్లను చెబితే ఖాతా ఖాళీ అవ్వడం ఖాయం. బ్యాంకులు ఎప్పుడూ ఫోన్ ద్వారా వ్యక్తిగత వివరాలు అడగవనే ప్రాథమిక విషయాన్ని ప్రజలు గుర్తించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఏ లింక్ క్లిక్ చేయకపోయినా అకౌంట్లో డబ్బు మాయమవుతోందన్న ఫిర్యాదులు కూడా అందుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

### పోలీసుల హెచ్చరిక.. గోల్డెన్ అవర్స్ కీలకం

సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించేందుకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆధ్వర్యంలో సోషల్ మీడియా అవేర్నెస్ ప్రోగ్రామ్స్ నిరంతరం కొనసాగుతున్నాయి. ఒకవేళ మీరు సైబర్ మోసానికి గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలి లేదా www.cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి. నేరం జరిగిన మొదటి రెండు గంటలు (గోల్డెన్ అవర్స్) చాలా కీలకమని, ఈ సమయంలో ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న డబ్బును వెనక్కి తెచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని పోలీసులు చెబుతున్నారు.

**మూడేళ్లలో రూ. 4,724 కోట్లు దోచేశారు**

**3లక్షలకుపైగా ఫిర్యాదుల**

- డిజిటల్ విప్లవం.. నేరగాళ్లకు వరం
- చదువుకున్న వారు, ఉన్నతోద్యోగులు, రిటైర్డ్ ఎంప్లాయీసే బాధితులు
- ప్రజా ప్రతినిధులు సైతం కేటుగాళ్ల వలకి..
- వినూత్న వ్యూహాలతో బురిడీ
- జీవితకాల సంపాదన క్షణాల్లో మాయం
- సైబర్ నేరాలపై అవగాహన అవసరం అంటున్న నిపుణులు
- అపరిచిత లింకులు, ఆఫర్లతో జాగ్రత్త అంటూ పోలీసుల హెచ్చరిక
- సైబర్ క్రైం జరిగితే గోల్డెన్ అవర్స్ చాలా కీలకం

## నాచారం పారిశ్రామిక వాడలో భారీ అగ్నిప్రమాదం

- గిడ్డంగిలో మంటలు.. సరుకు పూర్తిగా దగ్ధం
- గంటల తరబడి శ్రమించిన అగ్నిమాపక సిబ్బంది
- తప్పిన ప్రాణనష్టం.. ప్రమాద కారణాలపై దర్యాప్తు



**వేద న్యూస్, హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలోని నాచారం పారిశ్రామిక వాడలో శనివారం సంభవించిన భారీ అగ్నిప్రమాదంపై తాజా వివరాలు వెలుగులోకి వచ్చాయి. నాచారం నుంచి చిలుకానగర్ వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న గిడ్డంగిలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం సమయంలో గిడ్డంగిలో ఉన్న సరుకు మొత్తం మంటల్లో కాలిపోయినట్లు సమాచారం. మంటల తీవ్రత కారణంగా దట్టమైన పొగ ఆకాశాన్ని కమ్మేసి పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. అగ్ని వ్యాప్తి పక్కనే ఉన్న ఇతర యూనిట్లకు కూడా విస్తరించినట్లు సమాచారం. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక దళాలు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు ప్రారంభించాయి. కొంతసేపటి పాటు మంటలు అదుపులోకి రాకపోవడంతో అనేక ఫైర్ ఇంజిన్లు వినియోగించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మంటలను అదుపులోకి తీసుకురావడానికి సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. అయితే ఆస్తి నష్టం మాత్రం భారీగా జరిగినట్లు అంచనా వేస్తున్నారు. మంటలు ఎలా చెలరేగాయనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదని, పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. ప్రమాదం కారణంగా నాచారం–చిలుకానగర్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌ను తాత్కాలికంగా నిలిపివేసి, ఇతర మార్గాలకు మళ్లించారు. ప్రజలు ఆ ప్రాంతానికి దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఈ ఘటనతో నాచారం పారిశ్రామిక వాడలో భద్రతా చర్యలపై మరోసారి చర్చ ప్రారంభమైంది. పరిశ్రమల్లో అగ్ని భద్రత ప్రమాణాలను కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఎండ.. ప్రచండం

**రాష్ట్రంలో 44.6 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రతలు**

**కొమురంభీమ్ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత**



**మొదటి పేజీ తరువాయి**

ఉష్ణోగ్రత నమోదైం ది. అలాగే నిజామాబాద్ జిల్లాలోని మొండోరాలో 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ గణాంకాలు రాష్ట్రంలో ఎండల తీవ్రత ఎంత పెరిగిందో స్పష్టంగా చూపిస్తున్నాయి. గత సంవత్సరం ఇదే రోజుతో పోలిస్తే ఈసారి ఉష్ణోగ్రతలు మూడు నుంచి నాలుగు డిగ్రీల వరకు అధికంగా నమోదవుతున్నాయి. గత ఏడాది అత్యధికంగా 43.4 డిగ్రీలు నమోదైతే, ఈసారి 44.6 డిగ్రీలకు చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. వాతావరణ మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎండల తీవ్రత కారణంగా చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, ఎక్కువగా నీరు తాగాలని, శరీరాన్ని చల్లగా ఉంచుకోవాలని సూచించారు. మధ్యాహ్నం వేళల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తలపై రక్షణ కోసం టోపీ, గుడ్డలు ఉపయోగించాలని, తేలికపాటి ఆహారం తీసుకోవాలని సూచించారు. సూర్యరశ్మి నేరుగా తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎండలు మరికొన్ని రోజులు కొనసాగనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ వేసవి ప్రభావాన్ని తగ్గించుకోవాలని సూచిస్తున్నారు.

## జగిత్యాల నుంచే జైత్రయాత్ర



**వేద న్యూస్, జగిత్యాల**

జగిత్యాలలో రేపు నిర్వహించనున్న బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. జగిత్యాలలో ఇప్పటికే పండుగ వాతావరణం నెలకొంది అని, ఇక్కడి నుంచే బీఆర్‌ఎస్ జైత్రయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి జగిత్యాల ప్రజల ఆశీర్వాదంతోనే ముందుకు సాగుతామని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాజకీయ పునరేకీకరణ జరుగుతోందని, బీఆర్‌ఎస్‌కు మళ్లీ భారీ మద్దతు లభిస్తున్నదని అన్నారు. కేసీఆర్ సంవత్సరం తర్వాత బహిరంగ సభకు హాజరవుతుండటంతో ప్రజల్లో భారీ ఆసక్తి నెలకొందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ సభను అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయంగా చిన్నచిన్న ప్రయత్నాలకు పాల్పడుతున్నారని, మేడిగడ్డ పర్యటనల ద్వారా సభ ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. జగిత్యాలలో జరిగే సభను అడ్డుకునేందుకు రోడ్ల పనులు చేపడుతున్నారని, ప్రజల రాకను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అయినప్పటికీ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా సభను విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు. సభ ఏర్పాట్లపై మాట్లాడుతూ.. దాదాపు మూడు లక్షల మంచినీటి బాటిల్స్, రెండు లక్షల మజ్జిగ ప్యాకెట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా సాయంత్రం వేళల్లోనే సభ ప్రారంభమవుతుందని, కేసీఆర్ సాయంత్రం 5:30 గంటలకు సభకు చేరుకుంటారని వెల్లడించారు. ప్రజలు, కార్యకర్తలు సంయమనంతో వ్యవహరించి సభను విజయవంతం చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతులు, మహిళలు, యువత అందరూ కేసీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో హరీష్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సంజయ్, కొప్పుల ఈశ్వర్, విద్యాసాగర్ రావు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తదితర బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. జగిత్యాల సభ రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

- రాష్ట్రంలో రాజకీయ పునరేకీకరణ జరుగుతోంది
- బీఆర్‌ఎస్‌కు మళ్లీ భారీ మద్దతు లభిస్తున్నది
- కేసీఆర్ సభకు భారీ ఏర్పాట్లు..
- గులాబీ దళపతి ప్రసంగం కోసం జనం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు
- లక్షలాది ప్రజల సమక్షంలో సభ విజయవంతం అవుతుంది
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## డీలిమిటేషన్ పేరుతో బీజేపీ కుట్రలు

- దక్షిణాది రాష్ట్రాల మద్దతు కోసం ముందుకు వస్తాను
- మహిళా సాధికారతపై కట్టుబడి ఉన్నాం
- కాంగ్రెస్ పార్టీకి రాజకీయాల కంటే దేశమే ముఖ్యం
- సీఎం రేవంత్ రెడ్డి



**మొదటి పేజీ తరువాయి**

అభివర్ణించారు. ఇది కేవలం రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాలకు ఎదురు దెబ్బ అని పేర్కొన్నారు. దేశ సమగ్రతను కాపాడటంలో ఈ పరిణామం కీలకమైందని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలు చేసి దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయాలని ప్రయత్నించిందని ఆరోపించారు. ఈ కుట్రను అడ్డుకోవడంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర కీలకమైందని తెలిపారు. డీలిమిటేషన్ పేరుతో ఉత్తరాది, దక్షిణాది మధ్య విభేదాలు సృష్టించడానికి ప్రయత్నించడం ప్రమాదకరమని హెచ్చరించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయడంలో ఎలాంటి అడ్డంకులు లేవని, చిన్న సవరణలతో వెంటనే అమలు చేయవచ్చని ఆయన సూచించారు. ముఖ్యంగా ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కూడా సముచిత ప్రాతినిధ్యం కల్పించే విధంగా రిజర్వేషన్లు ఉండాలని డిమాండ్ చేశారు. ఇది సమగ్ర సామాజిక న్యాయానికి అవసరమని పేర్కొన్నారు. బీజేపీకి 400కు పైగా సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తుందని ఆయన ఆరోపించారు. లోక్‌సభ సీట్లను 850కి పెంచి శాశ్వత అధికారాన్ని కైవసం చేసుకోవాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. ఈ విధానం ప్రజాస్వామ్యానికి ముప్పు అని వ్యాఖ్యానించారు. సోమవారం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించి కేవలం మహిళా రిజర్వేషన్ బిల్లును మాత్రమే ప్రవేశపెడితే ఇండియా కూటమి ఏకగ్రీవంగా మద్దతు ఇస్తుందని తెలిపారు. దేశ ప్రయోజనాల కోసం రాజకీయ విభేదాలను పక్కనబెట్టి కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి రాజకీయాల కంటే దేశమే ముఖ్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళా సాధికారత కాంగ్రెస్ సిద్ధాంతాల్లో ప్రధాన భాగమని పేర్కొన్నారు. ఇందిరా గాంధీ వంటి నాయకత్వం దేశానికి మార్గదర్శకమైందని గుర్తుచేశారు. బీజేపీ నుంచి ఇప్పటివరకు మహిళా అధ్యక్షురాలు లేకపోవడం వారి మహిళా దృక్పథాన్ని చూపిస్తుందని విమర్శించారు. దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, చట్టసభల్లో వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించడం సమాజ పురోగతికి అవసరమని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు దేశ రాజకీయాల్లో ఒక చారిత్రక అడుగు అవుతుందని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాపాడుతూ, సమాన అవకాశాలు కల్పించే విధంగా కేంద్రం ముందుకు రావాలని ఆయన కోరారు. దేశ సమగ్రత, సమాన అభివృద్ధి లక్ష్యంగా అన్ని నిర్ణయాలు ఉండాలని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

## రేవంత్ రెడ్డిది 'క్రాస్ బ్రీడ్' బంధం

**మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు**

**వేద న్యూస్, హైదరాబాద్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత హరీష్ రావు తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి రాజకీయ విధానాన్ని హైబ్రిడ్ మోడల్ కాదు, కేంద్రంలోని బీజేపీ పెద్దలతో కుదుర్చుకున్న క్రాస్ బ్రీడ్ బంధంగా ఆయన వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకుల ఇళ్లను ముట్టడించాలని బీజేపీ పిలుపునిచ్చిన సమయంలో, రేవంత్ రెడ్డి ఢిల్లీలో బీజేపీ కేంద్రమంత్రి ఇంటికి వెళ్లి భోజనం చేయడం అనుమానాలకు తావిస్తోందని హరీష్ రావు ఆరోపించారు. ఈ చర్య రాజకీయంగా విరుద్ధ సంకేతాలు ఇస్తోందని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకు ఈ పరిణామాలు తెలుసా? అనే సందేహాన్ని వ్యక్తం చేశారు. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా జరిగే చర్యలపై వారు స్పందిస్తారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు స్పష్టత లేవని, ప్రజలకు భిన్న సంకేతాలు వెళ్తున్నాయని హరీష్ రావు విమర్శించారు. రాజకీయంగా పారదర్శకత అవసరమని, ప్రజలకు నిజాయితీగా వ్యవహరించాలని సూచించారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. బీఆర్‌ఎస్–కాంగ్రెస్ మధ్య విమర్శల యుద్ధం మరింత తీవ్రతరం అవుతున్నదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.



# ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలి

- రోజువారీ కూలీ రూ.600కు పెంచాలి
- సీపీఎం నేతల డిమాండ్



**వేద న్యూస్, బోయినిపల్లి:**

ఉపాధి హామీ కూలీలకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేసి, రోజువారీ వేతనాన్ని రూ.600కు పెంచాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేసింది. బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామంలో పనులు చేస్తున్న కూలీలను సీపీఎం నాయకులు కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్ మాట్లాడుతూ గత రెండు నెలలుగా కూలీల ఖాతాల్లో వేతనాలు జమ కాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లోపం కారణంగా కూలీలకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. పనిస్థలాల్లో తాగునీరు, నీడ కోసం టెంట్లు, మెడికల్ కిట్లు వంటి కనీస సౌకర్యాలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించి, కూలీల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కుడుకల గిరిబాబు, పెద్ద సంఖ్యలో కూలీలు పాల్గొన్నారు.

# మళ్లీ వడగండ్ల వాన బీభత్సం

- కంటతడి పెడుతున్న రైతన్నలు
- మరిమడ్లలో పంటలకు భారీ నష్టం



**వేద న్యూస్, కోనరావుపేట:**

కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో శనివారం ఒక్కసారిగా వాతావరణం మారి భారీ గాలిదుమారంతో కూడిన వడగండ్ల వాన కురిసింది. పెద్ద ఎత్తున వడగండ్లు పడటంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. ఇటీవలే కురిసిన వడగండ్ల వర్షంతో తీవ్ర నష్టం చవిచూసిన రైతులు ఇంకా కోలుకోకముందే మళ్లీ ప్రకృతి విరుచుకు పడటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చిన పంటలు మళ్లీ దెబ్బతింటాయని భయపడుతూ రైతులు కంటతడి పెడుతున్నారు. గాలివానకు చెట్లు విరిగిపడగా, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వరుసగా నష్టపోతున్న రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకుని నష్టపరిహారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# రోడ్ సేఫ్టీ పోటీల విజేతలకు కలెక్టర్ ప్రశంసలు

- సర్టిఫికెట్లు అందించి అభినందన



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అభినందించారు. పోలీస్, రవాణా శాఖల ఆధ్వర్యంలో జనవరి 1 నుంచి 31 వరకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహించి కంటి పరీక్షలు చేశారు. విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా పలువురు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు కలెక్టర్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. రోడ్డు భద్రతపై తమ కుటుంబ సభ్యులు, ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ కుమార్, పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పిల్లల ఆరోగ్యం కోసం పోషణ్ పక్వాడ

- అంగన్వాడీలో ప్రత్యేక కార్యక్రమాలు



**వేద న్యూస్, కారేపల్లి:**

కారేపల్లి మండలం వెంకట్యా తండా అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ రాధమ్మ మాట్లాడుతూ పిల్లలు, మహిళల ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో అవసరమని తెలిపారు. పాలు, గుడ్లు, కూరగాయలు, పండ్లు వంటి ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని చెప్పారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు పోషకాహారం అందించడంతో పాటు ఆరోగ్య పరీక్షలు కూడా నిర్వహించారు. గ్రామస్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు హిమబిందు, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

# ఓపెన్ హార్ట్ సర్జరీ బాధితునికి అండగా నిలిచిన పెగళ్ళపాటి లక్ష్మీనారాయణ



**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

గీసుకొండ మండల కేంద్రానికి చెందిన షేక్ అంకూస్ పాషా షరీఫ్ అనే నిరుపేద వ్యక్తి, వృత్తి రీత్యా ఆటోడ్రైవర్ రెండు నెలల క్రితం హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పటల్ లో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. అతని దయనీయ పరిస్థితిని గమనించిన అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ మేనేజర్,గీసుకొండ గ్రామ శ్రీమంతుడు గా ప్రసిద్ధి గాంచిన పెగళ్ళపాటి లక్ష్మీనారాయణ మానవత్వంతో స్పందించి రూ.5000ల ఆర్థిక సహాయాన్ని పంపగా అట్టి నగదును గీసుకొండ సోషల్ సర్వీస్ టీం ప్రతినిధులు కర్ణకంటి రాంమూర్తి, ముల్క సత్యనారాయణ, మహ్మద్ సోనీ, కత్తి వెంకటేశ్వర్లు మరియు బోడకుంట్ల ప్రభాకర్ బాధితునికి అందజేయడం జరిగింది. ఆపదలో ఉన్న తమకు అండగా నిలిచిన పెగళ్ళపాటి లక్ష్మీనారాయణకి అంకూస్ పాషా ధన్యవాదాలు తెలిపారు.

# ప్రైవేట్ బ్యాంకు కర్కశత్వం

- ఇంటికి తాళం వేసి నోటీసులు అంటించిన సిబ్బంది
- అనారోగ్యంతో కాలు కోల్పోయిన బాధితుడి ఆవేదన
- న్యాయం చేయాలని బాధిత కుటుంబం విజ్ఞప్తి



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్‌లో ప్రైవేట్ బ్యాంకు సిబ్బంది వ్యవహరించిన తీరు తీవ్ర ఆందోళనకు దారితీసింది. కరీంనగర్‌లోని ఐకెఎఫ్ ప్రైవేట్ బ్యాంకు నుంచి రూ.8 లక్షల రుణం తీసుకున్న బోగం గోపాల్ కుటుంబం ప్రస్తుతం రోడ్డున పడిన పరిస్థితి నెలకొంది. షుగర్ వ్యాధి కారణంగా గోపాల్‌కు కాలు తొలగించాల్సి రావడంతో, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, వడ్డీలు క్రమంగా చెల్లిస్తున్నామని బాధితుడు తెలిపాడు. అయితే నాలుగు ఈఎంఐలు చెల్లించలేకపోయిన నేపథ్యంలో బ్యాంకు సిబ్బంది ఇంటికి వచ్చి వేడుకున్నా వినిపించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇటీవల సిబ్బంది ఇంటికి వచ్చి బయటకు పంపించి, అనంతరం తాళం వేసి వీడియో తీసి, ఇంటిపై నోటీసులు అంటించి వెళ్లిపోయారు. దీంతో కుటుంబం రోడ్డున పడగా, స్థానికులు టెంట్ ఏర్పాటు చేసి సహాయం చేశారు. తరువాత బంధువులు వారిని ఎల్లారెడ్డి పేటకు తరలించారు. ఈ ఘటనపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి జిల్లా కలెక్టర్ న్యాయం చేయాలని కోరుతున్నారు.

# నల్లబెల్లిలో జనగణన శిక్షణ ప్రారంభం



**వేద న్యూస్, నల్లబెల్లి:**

జనగణన–2027 ప్రక్రియలో భాగంగా నల్లబెల్లి మండలంలో హౌస్‌లిస్టింగ్ పనుల కోసం శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మండలంలో మొత్తం 85 హౌస్‌లిస్టింగ్ బ్లాక్‌లు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ముప్పు కృష్ణ తెలిపారు. మే 11 నుండి జూన్ 9 వరకు మండలంలోని ప్రతి ఇంటిని గణన చేయడానికి 60 మంది ఎన్యుమరేటర్లు, 10 మంది సూపర్‌వైజర్లు విధులు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మొదటి విడత శిక్షణను ఏప్రిల్ 18, 19, 20 తేదీల్లో జెడ్పీహెచ్ఎస్ నల్లబెల్లిలో నిర్వహించారు. శిక్షణలో 33 మంది ఎన్యుమరేటర్లు, 6 మంది సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రవి, మండల ప్లానింగ్ & గణాంక అధికారి అనిల్ కుమార్, జెడ్పీహెచ్ఎస్ హెడ్‌మాస్టర్ వసంతతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మహిళా బిల్లును అడ్డుకోవడం సిగ్గుచేటు

- బీజేపీ చొప్పదండి పట్టణ శాఖ



**వేద న్యూస్, చొప్పదండి:**

పార్లమెంట్ లో 33 శాతం మహిళా బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసి అడ్డుకున్నందుకు నిరసనగా బిజెపి చొప్పదండి పట్టణ శాఖ అధ్యక్షులు చిల్ల శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఐఐ శాతం రిజర్వేషన్లతో మహిళా అభివృద్ధికి బాటలు వేస్తుంటే కాంగ్రెస్ పార్టీ కుట్రపూరితంగా బిల్లును అడ్డుకొని మహిళల పై కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకతను మరోసారి స్పష్టం చేసుకుందని, మహిళలు చట్టసభల్లోకి అడుగుపెడితే ఎక్కడ బీజేపీకి పేరు వస్తుందోనని అక్కసుతో అడ్డుకోవడం యావత్ మహిళ లోకానికి, వారి హక్కులకు అవమానమని, ఈ చారిత్రక ద్రోహం పట్ల మహిళ లోకం తీవ్ర ఆగ్రహజ్వాలలతో రగిలిపోతోందని రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి మహిళలు సరైన గుణపాఠం చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో8 వ వార్డు కౌన్సిలర్ రాజన్నల రాజు, 13 వ కౌన్సెలర్ జిట్టా మంగ- కుమార్, మాజీ పట్టణ అధ్యక్షులు బత్తిని ప్రశాంత్, జిల్లా కౌన్సల్ మెంబర్ గుండేటి శివశంకర్, జిల్లా నాయకులు గుర్రం సమరసింహ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి జిట్టా కుమార్, చల్ల అనుష్, బీసీ మోర్చా అధ్యక్షులు అమరగొండ తిరుపతి, మహిళా మోర్చా అధ్యక్షురాలు పెంచికల రమాదేవి, పట్టణ నాయకులు జాగీరి రాజేందర్, బొడిగె ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

# జనగణన సర్వేకు శిక్షణ ప్రారంభం



**వేద న్యూస్, మెట్‌పల్లి:**

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ చావిడిలో జనగణన సర్వే మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ స్పందన ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ కనకతార హాజరై మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనగణన సర్వే మే 11 నుంచి జూన్ 9 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్వే పూర్తిగా డిజిటల్ విధానంలో జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణలో సుమారు 154 మంది పాల్గొంటున్నారని తెలిపారు. శిక్షణకు శివప్రసాద్, ధరందీప్ రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరిస్తున్నారని వెల్లడించారు.

# చలివేంద్రం ప్రారంభించిన సీఐ



**వేద న్యూస్, శాయంపేట:**

మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ బాసని చంద్రప్రకాశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ రంజిత్ రావు, ఎస్సై జక్కుల పరమేశ్వర్ శనివారం ప్రారంభించారు. ఈ చలివేంద్రాన్ని కీర్తిశేషులు బాసని కైలాసం, కనక లక్ష్మి, రమాదేవి జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ రంజిత్ రావు మాట్లాడుతూ, మండలానికి వచ్చే ప్రజలకు ఈ చలివేంద్రం ఉపయుక్తంగా ఉండి దాహార్తిని తీర్చడంలో సహాయపడుతుందని అన్నారు. ప్రజలు దీనిని వినియోగించుకోవాలని సూచించారు. ఇంకా దాతలు ముందుకు వచ్చి ఇతర ప్రాంతాల్లో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాసని లక్ష్మీనారాయణ, సదాశివుడు, వెంకటపతి, చంద్రమౌళి, సామల రవీందర్, బాసని వెంకటేశ్వర్లు, గడ్డం బాబు తదితరులు పాల్గొన్నారు.


# తేజస్వి వ్యాఖ్యలను ఖండించిన ఎర్రబెల్లి స్వర్ణ

**వేద న్యూస్, హనుమకొండ:**

హనుమకొండలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా మహిళా కాంగ్రెస్ సమీక్షా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్‌పాకిస్తాన్ విభజనతో పోల్చడం అనుచితమని, ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని ఆమె అన్నారు. తేజస్వి సూర్య తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం అనేక త్యాగాల ఫలితంగా సాధించబడిందని, 2014లో రాష్ట్రం ఏర్పడటం చారిత్రక నిర్ణయమని పేర్కొన్నారు. అదేవిధంగా మహిళా కాంగ్రెస్ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కొత్త మహిళా నాయకత్వాన్ని తీసుకురావడం అవసరమని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్ నాగరాజు, జిల్లా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బాలికలకు విద్యతో పాటు ధైర్యం అవసరం



– డాక్టర్ అనితా రెడ్డి

**వేద న్యూస్, హనుమకొండ:**

అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రభుత్వ బాలికల ఆనంద నిలయం, బీసీ బాలికల హాస్టల్‌లో 'లింగ సమానత్వం బాలికా సాధికారత'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. బాల్యదశలోనే సరైన లక్ష్యాలు ఏర్పరచుకొని విద్యతో పాటు మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. మార్కులతో పాటు క్యారెక్టర్ కూడా ముఖ్యమని, ప్రతి బాలిక తనకు తానే ఆదర్శంగా నిలవాలని అన్నారు. బాలికలు ధైర్యంగా ఉండి సమస్యలను ఎదుర్కొనే సామర్థ్యం పెంపొందించుకోవాలని, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి అవగాహనతో పాటు డోంట్ టచ్ అనే ధైర్యం కలిగి ఉండాలని చెప్పారు. సెల్‌ఫోన్‌లకు పరిమితం కాకుండా ఆటపాటలతో పాటు సమగ్ర విద్యను అభ్యసించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆనంద నిలయం విద్యార్థులకు టవెల్స్, బ్లాక్‌బోర్డ్, స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డెన్ సరిత, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామీణ కార్మికుల జీవనోపాధిపై ప్రభావం

**– ఫోటో విధానం రద్దు చేయాలి – ఐఎన్టీయూసీ డిమాండ్**

**వేద న్యూస్, శాయంపేట:**



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతూ గ్రామీణ కార్మికుల జీవనోపాధిని దెబ్బతీస్తోందని ఐఎన్టీయూసీ మండల అధ్యక్షుడు మారపల్లి రాజేందర్ విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ, గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న ఈ పథకాన్ని బలహీనపరిచే చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ముఖ్యంగా కేవైసీ విధానం కారణంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పని ప్రదేశాల్లో నెట్ సౌకర్యం లేక ఫోటోలు అప్‌లోడ్ చేయలేక కూలీలు వేతనాలు కోల్పోతున్నారని, ఫోటో నమోదు కాకపోతే ఆ రోజు కూలి దక్కని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ఫోటోలు తీసే విధానాన్ని వెంటనే రద్దు చేసి, కార్మికులకు ఇబ్బంది కలిగించే నిబంధనలను సవరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# గ్రంథాలయం పూర్తయ్యేది ఇంకెప్పుడో?

**– రెండేళ్లైనా నిలిచిపోయిన నిర్మాణం**

**– నేలకొండపల్లిలో విద్యార్థులు, నిరుద్యోగుల అవస్థలు**

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రంలో గ్రంథాలయం నిర్మాణ పనులు రెండు సంవత్సరాలుగా పూర్తి కాకపోవడంతో స్థానిక నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేసినప్పటికీ పనులు ముందుకు సాగకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాత గ్రంథాలయాన్ని కూల్చి కొత్తది నిర్మిస్తామని ప్రకటించినప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేకపోవడంతో అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం గ్రంథాలయ సేవలు ప్రైవేట్ గదిలో తాత్కాలికంగా కొనసాగుతున్నాయి. రోజూ వందలాది మంది విద్యార్థులు, అభ్యర్థులు ఉపయోగించే గ్రంథాలయాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదని, వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేయాలని స్థానికులు, నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.



# హైదరాబాద్ సదస్సుకు ఉద్యమకారులు

**– జెండా ఊపి ప్రారంభించిన సర్పంచ్, ఉప సర్పంచ్**



**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండల కేంద్రం నుండి తెలంగాణ రాష్ట్ర స్థాయి ఉద్యమకారుల సదస్సుకు పెద్ద ఎత్తున ఉద్యమకారులు హైదరాబాద్‌కు బయలుదేరారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన కార్యకర్తలను సర్పంచ్ చింతల ఉమా రవిపాల్, ఉప సర్పంచ్ ధైనంపల్లి సుమన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు పొడిశెట్టి గణేష్, మండల అధ్యక్షుడు ఈమ్మడిశెట్టి రవీందర్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా 250 గజాల ఇళ్ల స్థలాలు, పెన్షన్‌ల అమలుపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి నాయకులు, యువజన ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

**– పలువురికి గాయాలు**

**– రాంగ్ రూట్లో వచ్చిన లారీయే ప్రమాదానికి కారణం**

**– బాధితుల వద్దకే వెళ్లి ఫిర్యాదు స్వీకరించిన ఎస్సై**

**వేద న్యూస్, శాయంపేట:**

హనుమకొండ జిల్లా శాయంపేట మండలం తహరాపూర్ సమీపంలో పరకాలహనుమకొండ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టిన ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో డ్రైవర్, కండక్టర్‌తో పాటు పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం, పరకాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పరకాల నుంచి హనుమకొండకు వెళ్తుండగా, మాంధారిపేట సమీపంలో రాంగ్ సైడ్‌లో వచ్చిన లారీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కాళ్లకు తీవ్ర గాయాలు కాగా, కండక్టర్‌కు చేతికి గాయం అయింది. ఇద్దరు ప్రయాణికులు కూడా గాయపడ్డారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్ ద్వారా ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



# మహిళను ప్రధాని చేయండి

**– డీసీసీ అధ్యక్షుడు మొహమ్మద్ అయూబ్**

**– ఎర్రబెల్లి స్వర్ణకు అభినందన సభలో వ్యాఖ్యలు**

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఎర్రబెల్లి స్వర్ణను రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమించిన సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మొహమ్మద్ అయూబ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎప్పటినుంచో మహిళలకు ప్రాధాన్యం ఇస్తోందని, ఇందిరా గాంధీ వంటి మహిళను ప్రధాని చేసిన చరిత్ర కాంగ్రెస్‌దని గుర్తు చేశారు. సోనియా గాంధీని పార్టీ అధ్యక్షురాలిగా నియమించడం కూడా అదే దృష్టాంతమని అన్నారు. బీజేపీపై విమర్శలు చేస్తూ, "దమ్ముంటే మీ పార్టీలో ఒక మహిళను ప్రధాని చేసి చూపండి" అంటూ సవాల్ విసిరారు. మహిళా సాధికారతపై కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, ఎర్రబెల్లి స్వర్ణ నాయకత్వంలో మహిళా కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్పంచులకు మార్గదర్శకాలపై అవగాహన

**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్పంచులకు 15వ ఆర్థిక సంఘం కార్యాచరణ మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. మండల పంచాయతీ అధికారి పసరగొండ రవి మాట్లాడుతూ, ప్రాథమిక, అనుబంధ, టైడ్, అన్‌టైడ్ గ్రాంట్ల వినియోగంపై సర్పంచులకు వివరించారు. ఈ నిధులను ఏ పనులకు వినియోగించాలో స్పష్టంగా తెలియజేశారు. మండలంలోని మౌలిక సదుపాయాల పరిస్థితిపై కూడా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.



వేద న్యూస్

ఆదివారం ఏప్రిల్ 19, 2026

# శాయంపేటలో తహసీల్దార్ ఆకస్మిక తనిఖీలు

**- ఎంజేపీ, కేజీబీవీ పాఠశాలల పరిశీలన**



**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల (ఎంజేపీ) మరియు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లను తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఎంజేపీ పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులతో మాట్లాడి, వారికి అందుతున్న భోజనం నాణ్యత, మెనూ అమలు తీరును తెలుసుకున్నారు. వంటగది, హాస్టల్ పరిస్థితులను పరిశీలించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. తదుపరి కేజీబీవీ పాఠశాలలో పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లు, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి ఇబ్బందులు, ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో ఎంజేపీ ప్రిన్సిపాల్ రేవతి, కేజీబీవీ ప్రిన్సిపాల్ మమతతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# చేనేత విగ్రహాన్ని రోడ్డు మధ్యలో ఏర్పాటు చేయాలి

**- ఎమ్మెల్యేకు పద్మశాలి సంఘం ప్రతినిధుల విజ్ఞప్తి**



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి పట్టణంలో జరుగుతున్న రహదారి పనుల నేపథ్యంలో చేనేత విగ్రహాన్ని రోడ్డు మధ్యలో ఏర్పాటు చేయాలని పద్మశాలి సంఘం ప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యాన్ని కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు పచ్చునూరి తిరుపతి, అనుమల్ల సత్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కూడా కోరారు. వినతిపై స్పందించిన ఎమ్మెల్యే, సమస్యను పరిశీలించి విగ్రహ ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి వల్లాల జగన్, సభ్యులు క్రిష్ణహరి, మల్లేశం, రాము, మహేష్, యువజన సంఘం సభ్యులు శ్రీనివాస్, వెంకటేష్, సాయి, మునిందర్, గంగారాజు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**- ఎంపీ రఘురామ్ రెడ్డి నిధులతో హ్యాండ్ బోరు ఏర్పాటు**



**వేద న్యూస్, కారేపల్లి:**

సింగరేణి మండలం చిన్నమడంపల్లి గ్రామంలో దీర్ఘకాలంగా ఉన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఖమ్మం ఎంపీ రామసాయం రఘురామ్ రెడ్డి ప్రత్యేక చొరవతో మంజూరైన నిధులతో గ్రామంలో నూతన హ్యాండ్ బోరు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి వచ్చింది. గ్రామస్తుల సమస్యను గుర్తించి నిధులు మంజూరు చేసిన ఎంపీకి సర్పంచ్ బానోతు పద్మ రూప్ల నాయక్, గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, తాగునీటి సమస్య పరిష్కారం గ్రామానికి పెద్ద ఉపశమనం అని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వర్ణలత, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని ప్రజలు అభినందించారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు



**- మద్యం సేవించి పట్టుబడితే జైలు శిక్షే**

**- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

**వేద న్యూస్, సిరిసిల్ల:**

సిరిసిల్ల సబ్ డివిజన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 18 మందిని పోలీసులు పట్టుకుని కోర్టులో హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ ప్రవీణ్ వారికి జైలు శిక్షలు, జరిమానాలు విధించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. శిక్షల వివరాలు ఇలా ఉన్నాయి: 9 మందికి ఒక రోజు జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.4వేల జరిమానా, 7 మందికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా, ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించగా, మరో ఇద్దరికి రూ.10వేల జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదాలకు దారితీస్తుందని, కుటుంబాలను కష్టాల్లోకి నెట్టవద్దని ఎస్పీ హెచ్చరించారు. ఇటువంటి కేసులు భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలపై కూడా ప్రభావం చూపవచ్చని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- యాసంగి సీజన్ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం**



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో టెంట్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించడంతో పాటు టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం యంత్రాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైస్ మిల్లర్ల నుంచి బ్యాంక్ గ్యారంటీ తీసుకోవాలని, కొనుగోళ్లు నిబంధనల ప్రకారం జరగాలని సూచించారు. కూలీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, తాలు, తడి లేకుండా సరుకును తరలించాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాల ఆన్లైన్ ప్రక్రియ, మిల్లుల కేటాయింపును వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీఓ గీత, పౌర సరఫరాల శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీలో ఆరవ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (ఆంగ్ల మాధ్యమం)లో వచ్చే విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ఖాళీగా ఉన్న 40 సీట్లకు అర్హులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారిణి బి. శ్యామల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రవేశాలకు దరఖాస్తు చేసే విద్యార్థినులు తప్పనిసరిగా అవసరమైన ధ్రువపత్రాలను జతపరచాలని సూచించారు. 5వ తరగతి బోనాఫైడ్, విద్యాసంబంధిత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, జనన, కుల, ఆదాయ మరియు ఆరోగ్య ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలు సమర్పించాలని తెలిపారు. అర్హత గల విద్యార్థినులు త్వరితగతిన దరఖాస్తులు సమర్పించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

# ఏడాదిగా అద్దె చెల్లించడం లేదని..

**- కిరాయి బకాయిపై యజమాని ఆగ్రహం**

**- ఆరోగ్య కేంద్రానికి తాళం వేసిన ఘటన**



**వేద న్యూస్, గోదావరిఖని:**

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని 5వ ఇంక్లైన్ ప్రాంతంలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇంటి యజమాని తాళం వేసిన ఘటన కలకలం రేపింది. వివరాల ప్రకారం, ఆదర్శ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కేంద్రానికి గదుల అద్దె గత ఏడాది నుంచి చెల్లించకపోవడంతో యజమాని రేగడి రాజేష్ ఆగ్రహంతో తాళం వేశారు. విషయం తెలిసిన సిబ్బంది సంబంధిత నిర్వాహకుడు నరసింహులకు సమాచారం అందించగా, రెండు రోజుల్లో బకాయి చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అయితే ప్రతిసారి ఇలాగే ఆలస్యం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని యజమాని ఆవేదన వ్యక్తం చేశారు.

# బాల్యమిత్రుని జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు




**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండలం రంగాపురం గ్రామంలో బాల్యమిత్రుడు కోడూరి బన్నీ జ్ఞాపకార్థం చిన్నారులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామస్తులు, ప్రయాణికులు దాహం తీర్చుకునేందుకు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. చిన్న వయసులోనే సేవాభావాన్ని చాటిన ఈ చిన్నారుల చర్యను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు సిద్ధు, రామ్, చరణ్, నూతన్, వర్షిత్, రాజు పాల్గొన్నారు.

# రైతు వేదికలో వార్డ్ సభ్యుల శిక్షణ

**- సర్టిఫికెట్లు అందజేత - గ్రామాభివృద్ధిపై అవగాహన**



**వేద న్యూస్, కారేపల్లి:**

సింగరేణి మండలం అప్పాయిగూడెం రైతు వేదికలో వార్డ్ సభ్యుల కోసం నిర్వహించిన శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. గ్రామాభివృద్ధిలో వార్డ్ సభ్యుల పాత్రను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ పూర్తిచేసుకున్న సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. గ్రామ పాలనలో పారదర్శకత, బాధ్యతాయుత విధానం, ప్రజల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ట్రైనర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామ అభివృద్ధిలో వార్డ్ సభ్యులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. సర్పంచ్‌లు దండు ప్రవీణ్, గుగులోత్ వరలక్ష్మి రాజు శిక్షణలో నేర్చుకున్న విషయాలను గ్రామాభివృద్ధికి వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్లు, పంచాయతీ కార్యదర్శులు, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

వేద న్యూస్

ఆదివారం ఏప్రిల్ 19, 2026

## పాపన్నపేటలో కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం

**– మహిళా రిజర్వేషన్ బిల్లుపై నిరసన**



**వేద న్యూస్, పాపన్నపేట:**

చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ల బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసినందుకు నిరసనగా పాపన్నపేటలో భాజపా శ్రేణులు కాంగ్రెస్, మిత్రపక్షాల దిష్టిబొమ్మను దహనం చేశారు. స్థానికంగా సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద జరిగిన ఈ నిరసనలో నాయకులు మాట్లాడుతూ, మహిళలకు రిజర్వేషన్లు కల్పించే చారిత్రాత్మక బిల్లును అడ్డుకోవడం సరికాదని విమర్శించారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ విధానం అడ్డంకిగా మారిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు బికొండ రాములు, చంద్రన్న, కిష్టయ్య, భాగేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లాలి ఆరోగ్యంతోనే కుటుంబ ఆరోగ్యం

**– పోషణ పక్వాడలో పోషకాహారంపై అవగాహన**



**వేద న్యూస్, రామడుగు:**

ఇంటి గృహిణి ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబ సభ్యులందరూ ఆరోగ్యవంతంగా జీవించగలరని వక్తలు పేర్కొన్నారు. లక్ష్మీపూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన అంగన్‌వాడి పోషణ పక్వాడ కార్యక్రమంలో ఈ విషయాన్ని వివరించారు. చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు తల్లుల చేతుల్లోనే ఉందని, 3–6 సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడి కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. బయట జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి, ఇంట్లోనే పోషకాహారం తయారు చేయాలని, పిల్లలకు ఆహారం ఇస్తూ సెల్‌ఫోన్ చూపించే అలవాటును మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ద్యావ అనంత రెడ్డి, ఐసిడీఎస్ అధికారి నర్సింగరాణి, ఎంపీడీవో రాజేశ్వరి, మహిళా అభివృద్ధి అధికారి సరస్వతి, సూపర్వైజర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**వేద న్యూస్, చిన్నచింతకుంట:**

దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు చిన్నచింతకుంట మండలం సి.సి కుంటలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని దేవరకద్ర మార్కెట్ చైర్మన్ కథలప్ప శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సన్న రకం 'ఏ' గ్రేడ్ ధాన్యానికి రూ. 2,389, 'బీ' గ్రేడ్‌కు రూ. 2,350 మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. అదనంగా సన్న రకానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధరతో పాటు బోనస్ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఏపీఎం నాగమణి, వెలుగు సీసీ కుర్మన్న, సర్పంచ్ మానస దశరథ్, ఉపసర్పంచ్ భూలక్ష్మి చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే నివాళి

**వేద న్యూస్, దేవరకద్ర:**



భూత్పూర్ మండలం కప్పెట గ్రామానికి చెందిన భూపాల్ రెడ్డి తండ్రి మరణించడంతో శనివారం దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి గ్రామానికి చేరుకుని మృతుడి భౌతిక దేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిల్లలను సురక్షితంగా గమ్యం చేర్చాలి

**– పాఠశాల బస్ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం**



**వేద న్యూస్, పాపన్నపేట:**

రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని పాపన్నపేట ఎస్సై సారా శ్రీనివాస్ గౌడ్ సూచించారు. పాపన్నపేటలోని శ్రీవిద్య పాఠశాలలో రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్ డ్రైవర్లు, సిబ్బందికి భద్రతా నిబంధనలు వివరించి వాహన పత్రాలను పరిశీలించారు. విద్యార్థులు ఎక్కే, దిగే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, బస్సు తలుపులు మూసిన తర్వాతే కదలించాలని సూచించారు. బస్సు దిగిన విద్యార్థులను సురక్షితంగా రోడ్డు దాటించాలన్నారు. ప్రమాదాల సమయంలో వెంటనే 108కు సమాచారం ఇచ్చి "గోల్డెన్ అవర్"లో చికిత్స అందేలా చూడాలని తెలిపారు. హెల్మెట్, సీటు బెల్ట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని, నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్, సెల్‌ఫోన్ వినియోగం వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. రోడ్డు భద్రత ప్రతి పౌరుడి బాధ్యత అని, నియమాలు పాటిస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్ గుప్తా, సిబ్బంది, బస్ డ్రైవర్లు, హెల్పర్లు, పోలీసులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి మహిళలు గుణపాఠం చెప్తారు

**– బీజేపీ మహిళా మోర్చా**

**– శంకరపట్నంలో నిరసన కార్యక్రమం**



**వేద న్యూస్, శంకరపట్నం:**

మహిళా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ పార్టీకి రాబోయే రోజుల్లో దేశ మహిళలు తగిన గుణపాఠం చెప్తారని బీజేపీ మహిళా మోర్చా నాయకులు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో మహిళా మోర్చా అధ్యక్షురాలు చెర్ల అనిత ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు బీజేపీ పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టగా, కాంగ్రెస్ పార్టీ దానికి వ్యతిరేకంగా ఓటు వేసిందని విమర్శించారు. ఇది మహిళల పట్ల కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదనే విషయాన్ని వెల్లడిస్తోందని పేర్కొన్నారు. దేశంలో కొద్ది మందికి మాత్రమే పదవులు కేటాయించే కాంగ్రెస్ తీరును తప్పుబట్టిన వారు, మహిళలకు సముచిత ప్రాధాన్యం కల్పించడంలో బీజేపీ కట్టుబడి ఉందని తెలిపారు. భవిష్యత్తులో మహిళా రిజర్వేషన్ అమలు బీజేపీ ద్వారానే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్, జిల్లా ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు కొమురయ్యతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాఠశాల స్థలం మార్పుపై పునఃపరిశీలించాలి

**– బీఆర్ఎస్ నాయకుల డిమాండ్**

**వేద న్యూస్, చిన్నచింతకుంట:**

ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం అనుకూలంగా లేదని, దానిపై పునఃపరిశీలన చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. చిన్నచింతకుంట మండలం ఉంద్యాల గ్రామంలో నాలుగో రోజు ప్రజలతో అభిప్రాయ సేకరణ అనంతరం శనివారం మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు సంతోష్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వావిళ్ల వెంకటేశ్వర రెడ్డి, మండల అధ్యక్షుడు కోటా రామ్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఈ స్థలంలో పాఠశాల నిర్మాణం చేయడం సరైంది కాదన్నారు. అవసరమైతే నియోజకవర్గంలో ఇతర అనుకూల స్థలంలో నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఇతనాల్ కెమికల్ ఫ్యాక్టరీ సమీపంలో పాఠశాల నిర్మిస్తే పిల్లల ఆరోగ్యం, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి సరైన నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బండారి యోనా, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మహిపాల్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా తీరు మానవ మనుగడకు ముప్పు

**– ఏఐపీఎస్ఓ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ**



**వేద న్యూస్, వనపర్తి:**

అమెరికా సామ్రాజ్యవాద ధోరణి ప్రపంచ మానవ మనుగడకు ముప్పుగా మారిందని, శాంతి కోసం ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపీఎస్ఓ) నేతలు పిలుపునిచ్చారు. శనివారం ఏఐపీఎస్ఓ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ నుంచి రాజీవ్ చౌక్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. 'యుద్ధం వద్దు – శాంతి ముద్దు', 'ప్రపంచ శాంతి వర్ధిల్లాలి' వంటి నినాదాలతో నేతలు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో జిల్లా సమన్వయ కార్యదర్శి యత్తం శివ అధ్యక్షతన నేతలు మాట్లాడుతూ, అమెరికా ఇతర దేశాలపై ఆధిపత్యం చెలాయిస్తూ సహజ వనరులను దోచుకుంటోందని విమర్శించారు. యుద్ధాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని ఆవేద వ్యక్తం చేశారు. ప్రపంచ శాంతి కోసం దేశాలు సంఘటితమై యుద్ధాలను అరికట్టాలని, మానవ మనుగడను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# విజ్ఞాన్ విద్యార్థుల విజయ దుందుభి

**– రాష్ట్ర స్థాయిలో 4, 5వ ర్యాంకులు సాధన**



**వేద న్యూస్, వనపర్తి:**

వనపర్తి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి ప్రతిభ చాటారు. బైపీసీ మొదటి సంవత్సరంలో భవాని 436/440 మార్కులతో రాష్ట్రంలో 4వ ర్యాంకు సాధించగా, ఎంపీసీ రెండో సంవత్సరంలో అములేశ్వరి 992/1000 మార్కులతో 5వ ర్యాంకు సాధించింది. ఇతర విద్యార్థులు కూడా మెరుగైన ఫలితాలు సాధించారు. బైపీసీ మొదటి సంవత్సరంలో రాణి 431/440, ఎంపీసీ మొదటి సంవత్సరంలో కృష్ణకుమార్ 456/470, ప్రియాంక 454/470 మార్కులు సాధించారు. సీఈసీ మొదటి సంవత్సరంలో అశోక్ కుమార్ 473/500, బబ్లు నాయక్ 456/500 మార్కులు పొందారు. సీనియర్ ఎంపీసీలో నందు, సోయల్ ఇద్దరూ 986/1000 మార్కులు సాధించగా, సీఈసీలో గణేష్ 975/1000, బైపీసీలో పావని, చందు 975/1000 మార్కులతో రాణించారు. విద్యార్థుల విజయాన్ని అభినందిస్తూ కళాశాల కరస్పాండెంట్ రాజేష్, డైరెక్టర్ క్రాంతి, ప్రిన్సిపాల్ శివమణి సత్కరించారు.

# 400 కి.మీ రేంజ్ స్కూటర్




**వేద న్యూస్ డెస్క్:**

భారతీయ ఎలక్ట్రిక్ టూ–వీలర్ సంస్థ సింపుల్ ఎనర్జీ అత్యధిక రేంజ్ అందించే అల్ట్రా ఎలక్ట్రిక్ స్కూటర్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చింది. ఒక్కసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే ఏకంగా 400 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యంతో ఈ స్కూటర్ వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈ స్కూటర్ విక్రయాలు ప్రారంభమైనట్లు కంపెనీ వెల్లడించింది. ఈ స్కూటర్‌లో 6.5 కిలోవాట్ అవర్ సామర్థ్యం గల పెద్ద బ్యాటరీను అమర్చారు. కంపెనీ అంచనా ప్రకారం ఇది 400 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదు. అంటే ఒకసారి ఛార్జ్ చేస్తే బెంగళూరు నుంచి చెన్నై వరకు కూడా సులభంగా ప్రయాణించవచ్చు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న అనేక ఎలక్ట్రిక్ వాహనాల కంటే ఇది ఎక్కువ రేంజ్‌ను అందించడం విశేషంగా చెప్పుకోవాలి. పనితీరు విషయంలో కూడా ఈ స్కూటర్ ముందంజలో ఉంది. గరిష్టంగా గంటకు 115 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. కేవలం 2.77 సెకన్లలో 0 నుంచి 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకోవడం దీని ప్రత్యేకత. దీంతో ఇది దేశంలో వేగవంతమైన ఎలక్ట్రిక్ స్కూటర్లలో ఒకటిగా నిలుస్తోంది. భద్రత, సౌలభ్యం కోసం ఆధునిక సాంకేతికతను ఇందులో పొందుపరిచారు. నాలుగు స్థాయిల ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్ ఉండటంతో తడి లేదా జారే రోడ్లపై స్కూటర్ జారిపోకుండా ఉంటుంది. అలాగే 7 అంగుళాల పెద్ద డిజిటల్ డిస్‌ప్లే ద్వారా నావిగేషన్, రైడ్ మోడ్‌లు, బ్యాటరీ వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. ఈ స్కూటర్ ధర సుమారు రూ.2.35 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై, కొచ్చి, గోవా వంటి ప్రధాన నగరాల్లో ఇప్పటికే విక్రయాలు జరుగుతుండగా, త్వరలో మరిన్ని నగరాల్లో అందుబాటులోకి తీసుకురావాలని కంపెనీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

# పీఎఫ్ విత్‌డ్రా సులభం




**వేద న్యూస్ డెస్క్:**

ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) డబ్బులు విత్‌డ్రా చేసుకోవడం ఇప్పటివరకు క్లిష్టమైన ప్రక్రియగా ఉండేది. అయితే ఇప్పుడు ఈ విధానం పూర్తిగా మారబోతోంది. ఈపీఎఫ్ఓ 3.0 పేరిట సంస్థ భారీ డిజిటల్ మార్పులకు సిద్ధమవుతోంది. ఈ కొత్త వ్యవస్థ అమల్లోకి వస్తే, పీఎఫ్ డబ్బులు తీసుకోవడం బ్యాంక్ లావాదేవీలంత సులభంగా మారనుంది. ఇప్పటివరకు పీఎఫ్ డబ్బులు పొందేందుకు ఉద్యోగులు ఆన్‌లైన్‌లో క్లెయిమ్ దాఖలు చేసి, ఆమోదం కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. కానీ ఈపీఎఫ్ఓ 3.0 ద్వారా ఈ ప్రక్రియను వేగవంతం చేసి, తక్షణ సేవలుగా మార్చే ప్రయత్నం జరుగుతోంది. అత్యవసర పరిస్థితుల్లో ఉద్యోగులు తమ డబ్బులను వెంటనే పొందేలా సిస్టమ్‌ను రూపొందిస్తున్నారు. ఈ మార్పులో ముఖ్యమైన అంశం పీఎఫ్ ఖాతాను రోజువారీ లావాదేవీలతో అనుసంధానం చేయడం. ఇందుకోసం ప్రత్యేక పీఎఫ్ ఏటీఎం కార్డును ప్రవేశపెట్టే యోచనలో ఈపీఎఫ్ఓ ఉంది. ఈ కార్డు డెబిట్ కార్డు మాదిరిగానే పనిచేస్తుంది. దీంతో ఉద్యోగులు సమీపంలోని ఏటీఎంలోకి వెళ్లి, అవసరమైన మొత్తాన్ని నేరుగా విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, పీఎఫ్ ఖాతాను యూపీఐతో కూడా అనుసంధానించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీని ద్వారా మొబైల్ యాప్‌ల సహాయంతోనే పీఎఫ్ డబ్బులను నేరుగా బ్యాంక్ ఖాతాకు బదిలీ చేసుకోవచ్చు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పోర్టల్ మరియు మొబైల్ యాప్‌ల ద్వారా జరిగే లావాదేవీలు కూడా మరింత వేగంగా, సులభంగా మారనున్నాయి. అయితే ఈ సదుపాయాలకు కొన్ని పరిమితులు ఉండే అవకాశం ఉంది. ప్రారంభ దశలో మొత్తం పీఎఫ్ బ్యాలెన్స్‌లో 50 నుంచి 75 శాతం వరకు మాత్రమే విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించే అవకాశం ఉంది. దీనిపై పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. ఈ కొత్త వ్యవస్థ ప్రారంభ తేదీపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రారంభంలో ఏప్రిల్‌లోనే ప్రారంభమవుతుందని భావించినప్పటికీ, అమలు కొంత ఆలస్యం అవుతోంది. త్వరలోనే కొత్త మొబైల్ యాప్‌తో పాటు పూర్తి సదుపాయాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

# మెటాలో మళ్లీ ఉద్యోగాల కోతల భయం

**వేద న్యూస్ డెస్క్:**




టెక్నాలజీ రంగంలో ఉద్యోగాల కోతల కలకలం కొనసాగుతున్న వేళ ప్రముఖ సంస్థ మెటా మరోసారి పెద్దఎత్తున ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమవుతున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. వచ్చే నెలాఖరుకల్లా సుమారు 8 వేల మంది ఉద్యోగులపై వేటు వేసే అవకాశముందని సమాచారం. ప్రపంచవ్యాప్తంగా సంస్థలోని మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 10 శాతం మందిపై ఈ ప్రభావం పడొచ్చని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా, ఈ ఏడాది ద్వితీయార్థంలో మరిన్ని తొలగింపులు కూడా ఉండొచ్చని తెలుస్తోంది. అయితే ఈ విషయాలపై సంస్థ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం మెటా సంస్థ కృత్రిమ మేధస్సు రంగంపై దృష్టి సారిస్తూ సంస్థలో పలు మార్పులు చేపడుతోంది. ఈ నేపథ్యంలో వ్యయాలను తగ్గించడం, నిర్మాణాత్మక మార్పులు చేయడం వంటి చర్యల్లో భాగంగా ఉద్యోగాల కోతలు ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల అమెరికాకు చెందిన అనేక సంస్థలు కూడా ఇదే దారిలో నడుస్తున్నాయి. ఇప్పటికే కొన్ని పెద్ద సంస్థలు వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగించగా, మరికొన్ని సంస్థలు కూడా అదే విధానాన్ని అనుసరిస్తున్నాయి. కృత్రిమ మేధస్సు వినియోగం పెరగడంతో ఉత్పాదకత పెరుగుతున్నప్పటికీ, ఉద్యోగాల భద్రతపై ఆందోళనలు మాత్రం రోజురోజుకూ పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో టెక్ రంగంలో ఈ ఉద్యోగాల కోతల ధోరణి మరింత వేగం పడే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# బసాల్ట్ ధరల పెంపు



**వేద న్యూస్ డెస్క్:**

సిట్రోయెన్ ఇండియా తన వాహనాల ధరలను పెంచుతూ వినియోగదారులకు షాక్ ఇచ్చింది. ముఖ్యంగా బసాల్ట్ ఎక్స్ మోడల్‌పై ధరలు గణనీయంగా పెరిగాయి. అలాగే సీ3, ఎయిర్‌క్రాస్ మోడళ్లపై కూడా పెంపు అమలు చేసింది. వేరియంట్‌ను బట్టి ధరల పెరుగుదల మారుతూ ఉండగా, మెజారిటీ మోడళ్లపై గరిష్టంగా రూ.40,000 వరకు పెంపు కనిపిస్తోంది. ప్లస్ 1.2 నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ మాన్యువల్ వేరియంట్ ధర సుమారు రూ.37,000 వరకు పెరిగింది. అయితే మ్యాక్స్ టర్బో పెట్రోల్ మాన్యువల్ డార్క్ ఎడిషన్ ధరలో ఎలాంటి మార్పు లేకపోవడం కొంత ఊరటనిస్తోంది. ఈ తాజా పెంపుతో బసాల్ట్ ఎక్స్–షోరూమ్ ధరలు ప్రస్తుతం రూ.8.55 లక్షల నుంచి రూ.13.95 లక్షల వరకు ఉన్నాయి. ఈ కారు 'యూ', 'ప్లస్', 'మ్యాక్స్' అనే మూడు ట్రిమ్‌లలో లభిస్తోంది. ఇంజిన్ విషయానికి వస్తే, ఈ ఎస్‌యూవీ రెండు రకాల 1.2 లీటర్ పెట్రోల్ ఇంజిన్ ఆప్షన్లతో అందుబాటులో ఉంది. టర్బో పెట్రోల్ ఇంజిన్ 110 పీఎస్ పవర్, 205 ఎన్ఎమ్ టార్క్‌ను ఇస్తుంది. నేచురల్లీ ఆస్పిరేటెడ్ ఇంజిన్ 82 పీఎస్ పవర్, 115 ఎన్ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. వాహన తయారీ సంస్థలు ఏప్రిల్ నెల నుంచి ధరలు పెంచుతున్న నేపథ్యంలో, ఈ పెంపు కూడా అదే ధోరణిలో భాగంగా ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి

# ఒకే రోజు రెండు క్లిష్ట ఆపరేషన్లు సక్సెస్

## – వైద్యుల ప్రతిభకు నిదర్శనం

**వేద న్యూస్, సూర్యాపేట:**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డ 20వ వార్డులోని హెల్తీ ఫై ఆసుపత్రిలో వైద్యులు ఒకే రోజు రెండు క్లిష్ట శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి తమ నైపుణ్యాన్ని చాటారు. రామారం గ్రామానికి చెందిన చిలక మానస (21), తుమ్మగూడెం గ్రామానికి చెందిన మహేష్ (21)లకు నిర్వహించిన ఈ శస్త్రచికిత్సలు గంటల పాటు సాగాయి. ఎముకలు, నరాలు, రక్తనాళాలను సమర్థంగా కలిపి చేతిని సాధారణ స్థితికి తీసుకురావడంలో వైద్యులు విజయవంతమయ్యారు. ప్రస్తుతం ఇద్దరి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. హాస్పిటల్ చైర్మన్ మతకాల చలపతిరావు మాట్లాడుతూ, ఇలాంటి క్లిష్ట ఆపరేషన్లు సాధారణంగా ఖరీదైనవైనా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు ఉచితంగా అందించడం సాధ్యమవుతోందని అన్నారు. సమయానికి ఆసుపత్రికి చేరుకోవడం వల్లే ఈ చికిత్స విజయవంతమైందని తెలిపారు. చికిత్స ఉచితంగా లభించడంతో బాధితుల కుటుంబ సభ్యులు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం పేదలకు నిజమైన వరంగా మారిందని పేర్కొన్నారు.

# రీఛార్జ్ అవ్వడానికే ఆదివారం

- బిజీ జీవితంలో రీఛార్జ్ అవ్వడానికి ఒక చక్కని అవకాశం
- వారాంతపు విరామం, మానసిక ప్రశాంతత
- కుటుంబ అనుబంధాల బలోపేతం
- రాబోయే వారం కోసం సన్నద్ధత మరియు ప్రణాళిక

**వేద న్యూస్ డెస్క్:**

ఆధునిక మానవ జీవితం యంత్రగతిలో సాగిపోతోంది. ఉదయం నిద్రలేచినప్పటి నుండి రాత్రి పడుకోబోయే వరకు ఏదో ఒక పని, ఒత్తిడి, టార్గెట్లు మనల్ని వెంటాడుతూనే ఉన్నాయి. ఇలాంటి ఉరుకుల పరుగుల జీవనశైలిలో 'ఆదివారం' అనేది ఒక మధురమైన వరం వంటిది. వారం పొడవునా పడిన కష్టాన్ని మర్చిపోయి, కాసేపు మన కోసం మనం సమయాన్ని కేటాయించుకోవడానికి ఈ సెలవు దినం ఎంతగానో ఉపయోగపడుతుంది. కేవలం విశ్రాంతి కోసమే కాకుండా, శారీరక మరియు మానసిక ఆరోగ్యానికి ఈ విరామం ఒక ఔషధంలా పనిచేస్తుంది. ఆదివారం అనగానే మనందరికీ గుర్తొచ్చేది కుటుంబం. వారం మొత్తం ఆఫీసు పనులు, వ్యాపారాలు లేదా పిల్లల చదువులతో గడిచిపోవడంతో ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి కూడా సమయం దొరకదు. అటువంటి తరుణంలో ఆదివారం ఇంట్లోని వారందరూ ఒకే చోట చేరి కబుర్లు చెప్పుకోవడం, కలిసి భోజనం చేయడం వల్ల కుటుంబ అనుబంధాలు మరింత బలపడతాయి. పెద్దలు పిల్లలతో గడపడం, వారి చిన్న చిన్న ముచ్చట్లను వినడం వల్ల పిల్లలలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఈ సామీప్యత మనలోని ఒత్తిడిని తగ్గించి సరికొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది.

మనం గత ఆరు రోజులుగా ఏం చేశాం, ఏయే లక్ష్యాలను చేరుకున్నాం మరియు ఎక్కడ వెనుకబడ్డాం అని విశ్లేషించుకోవడానికి ఆదివారం ఒక గొప్ప వేదిక. ఈ సెలవు దినాన్ని కేవలం నిద్రపోవడానికే పరిమితం చేయకుండా, వారం మొత్తం జరిగిన పనులను ఒకసారి సమీక్షించుకోవడం వల్ల మన పురోగతి మనకు అర్థమవుతుంది. వచ్చే వారం చేయాల్సిన పనుల గురించి ఒక ప్రణాళికను సిద్ధం చేసుకోవడానికి ఇది సరైన సమయం. ఇలా ప్లాన్ చేసుకోవడం వల్ల సోమవారం నుండి పని ఒత్తిడిని సులభంగా ఎదుర్కోవచ్చు మరియు సమయాన్ని సమర్థవంతంగా నిర్వహించవచ్చు.

ఆదివారం మనలోని సృజనాత్మకతకు పదును పెట్టడానికి కూడా అనువైన రోజు. వారం రోజులు పనిలో నిమగ్నమై మన ఇష్టాలను, అభిరుచులను పక్కన పెట్టేస్తాం. మనకు నచ్చిన పుస్తకం చదవడం, మొక్కలకు నీళ్లు పోయడం, సంగీతం వినడం లేదా మనకు నచ్చిన వంటకాన్ని చేసుకోవడం వంటి చిన్న చిన్న పనులు మనకు ఎంతో సంతృప్తినిస్తాయి. ఇలాంటి వ్యాపకాలు మన మెదడును చురుగ్గా ఉంచి, కొత్త ఆలోచనలు రావడానికి దోహదపడతాయి. మన వ్యక్తిగత ఎదుగుదలకు మనతో మనం గడపడం చాలా ముఖ్యం.

చాలామంది ఆదివారం కూడా ఆఫీసు పనుల గురించి ఆలోచిస్తూ గడిపేస్తుంటారు. ఇది ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదు. పనిని పని ప్రదేశంలోనే వదిలేసి, ఇంటి దగ్గర ఉన్నప్పుడు పూర్తి మనసుతో ఉండటం నేర్చుకోవాలి. డిజిటల్ ప్రపంచానికి కాసేపు దూరంగా ఉండటం, అంటే ఫోన్ లేదా ల్యాప్‌టాప్ పక్కన పెట్టడం వల్ల కళ్ళకు మరియు మెదడుకు విశ్రాంతి దొరుకుతుంది. ప్రకృతితో కాసేపు గడపడం లేదా పార్కుకు వెళ్లడం వల్ల స్వచ్ఛమైన గాలి పీల్చుకోవచ్చు, ఇది మనలో రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి సహకరిస్తుంది.

సమాజంలో ఎదుగుతున్న పోటీ వల్ల సెలవు దినాల్లో కూడా అదనపు పనులు పెట్టుకోవడం ఒక అలవాటుగా మారింది. అయితే, విరామం లేని పని యంత్రాలను సైతం మొరాయించేలా చేస్తుంది, ఇక మనుషుల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సరైన విశ్రాంతి లేకపోతే ఏకాగ్రత దెబ్బతింటుంది మరియు పని నాణ్యత తగ్గుతుంది. అందుకే సెలవును సెలవులాగే అనుభవించాలి. ఆదివారం తీసుకునే విశ్రాంతి మనల్ని వచ్చే వారం అంతా ఉత్సాహంగా ఉంచుతుందని వైద్య నిపుణులు సైతం చెబుతున్నారు.

ఆదివారం రోజున సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం లేదా బంధుమిత్రులను సందర్శించడం వంటివి చేయడం వల్ల మన సామాజిక పరిధి పెరుగుతుంది. పాత స్నేహితులతో ఫోన్లో మాట్లాడటం లేదా వారిని నేరుగా కలవడం వల్ల మనసు తేలికపడుతుంది. ఒంటరిగా గడిపే వృద్ధులను లేదా అవసరంలో ఉన్నవారిని పలకరించడం ద్వారా మనకు తెలియని ఒక ఆధ్యాత్మిక సంతృప్తి లభిస్తుంది. ఇతరులకు సహాయం చేయడం వల్ల కలిగే ఆనందం మన వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతుంది.

విద్యార్థులకు ఆదివారం అనేది కేవలం చదువుల నుండి విరామమే కాదు, వారి ప్రతిభను వెలికితీసే సమయం. ఆటలాడటం, చిత్రలేఖనం లేదా కొత్త విషయాలను నేర్చుకోవడం ద్వారా వారిలో బహుముఖ ప్రజ్ఞాపాటవాలు అభివృద్ధి చెందుతాయి. కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా బయటి ప్రపంచాన్ని చూడటం వల్ల వారికి ప్రయోగాత్మక జ్ఞానం లభిస్తుంది. తల్లిదండ్రులు తమ పిల్లల ఇష్టాలను గుర్తించి వారిని ప్రోత్సహించడానికి ఈ రోజును ఒక అవకాశంగా మలుచుకోవాలి ఆరోగ్యపరంగా చూస్తే ఆదివారం అనేది మన శరీరానికి ఇచ్చే ఒక 'సర్వీసింగ్' వంటిది. నిద్రలేమి సమస్యతో బాధపడేవారు ఈ రోజు తగినంత నిద్రపోవడం ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అలాగే, వారం మొత్తం ఆఫీసు క్యాంటీన్లో లేదా బయట తిన్న వారికి, ఇంట్లో వండిన స్వచ్ఛమైన ఆహారం తినడానికి ఇది మంచి అవకాశం. శరీరానికి కావాల్సిన పోషకాలను అందించే ఆహారం తీసుకోవడం వల్ల మన జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మన శరీరం ఇచ్చే సంకేతాలను అర్థం చేసుకుని దానికి తగిన విశ్రాంతి ఇవ్వడం ఎంతో అవసరం.

ఆదివారం అనేది కాలెండరులో ఒక ఎర్రటి అక్షరం మాత్రమే కాదు, అది మన జీవితాలను రీఛార్జ్ చేసే ఒక అద్భుతమైన రోజు. సమయాన్ని వృథా చేయకుండా, దాన్ని అర్థవంతంగా ఉపయోగించుకోవడంలోనే మన విజ్ఞత ఉంది. రేపు రాబోయే ఆదివారాన్ని మీ ప్రియమైన వారితో కలిసి ఆనందంగా గడపండి. గత వారం వైఫల్యాలను వదిలేసి, కొత్త ఉత్సాహంతో రాబోయే వారానికి స్వాగతం పలకండి. గుర్తుంచుకోండి, పని కోసం జీవితం కాదు, జీవితం కోసమే పని.

ఆదివారం రోజున సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం లేదా బంధుమిత్రులను సందర్శించడం వంటివి చేయడం వల్ల మన సామాజిక పరిధి పెరుగుతుంది. పాత స్నేహితులతో ఫోన్లో మాట్లాడటం లేదా వారిని నేరుగా కలవడం వల్ల మనసు తేలికపడుతుంది. ఒంటరిగా గడిపే వృద్ధులను లేదా అవసరంలో ఉన్నవారిని పలకరించడం ద్వారా మనకు తెలియని ఒక ఆధ్యాత్మిక సంతృప్తి లభిస్తుంది. ఇతరులకు సహాయం చేయడం వల్ల కలిగే ఆనందం మన వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతుంది.

వేద న్యూస్

ఆదివారం ఏప్రిల్ 19, 2026

# విజయ్ కొత్త చిత్రం ప్రకటన.. శౌర్యువ్‌తో జోడీ




**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ తన తదుపరి చిత్రాన్ని యువ దర్శకుడు శౌర్యువ్‌తో చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఈ సినిమాకు ప్రపంచ స్థాయి సాంకేతిక నిపుణులు పని చేయనున్నారని చిత్ర బృందం వెల్లడించింది. హాలీవుడ్ విజువల్ ఎఫెక్ట్స్ నిపుణుడు ఎరిక్ డర్ట్స్, అంతర్జాతీయ సినిమాటోగ్రాఫర్ అలెజాంద్రో మార్టినెజ్, ఎడిటర్ ప్రవీణ్ ఆంటోనీ, ఆర్ట్ డైరెక్టర్ సురేష్ సెల్వరాజన్, కాస్ట్యూమ్ డిజైనర్ సచిన్ లోవలేకర్ వంటి ప్రముఖులు ఈ ప్రాజెక్టులో భాగమవుతున్నారు. సంగీత బాధ్యతలను హేషమ్ అబ్దుల్ వహాబ్ నిర్వర్తించనున్నారు. ఇంతకుముందు వచ్చిన చిత్రానికి ఆయన అందించిన సంగీతం మంచి ఆదరణ పొందింది. ఈ చిత్రం భారీ యాక్షన్ నేపథ్యంతో రూపొందనుండగా, దర్శకుడు శౌర్యువ్ తొలి చిత్రం సాధించిన విజయానికి పూర్తి భిన్నంగా ఉండబోతోందని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ, ఇది తనకు ఎంతో సవాల్‌గా ఉన్న ప్రాజెక్ట్ అని, తన శక్తి మేరకు కష్టపడి ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం విజయ్ కెరీర్‌లో ప్రత్యేక స్థానం సంపాదించే అవకాశముందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# రెజీనా భావోద్వేగం.. ప్రేమ, కెరీర్‌పై ఆవేదన




**వేద న్యూస్ డెస్క్:**

తెలుగు, తమిళ ప్రేక్షకులకు సుపరిచితురాలైన నటి రెజీనా కాసాండ్రా తన వ్యక్తిగత జీవితం, కెరీర్ గురించి భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె తన గత అనుభవాలను పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. తాను ఒక సమయంలో గాఢంగా ప్రేమించిన వ్యక్తితో ఉన్న సంబంధం తనను మానసికంగా తీవ్రంగా ప్రభావితం చేసిందని ఆమె వెల్లడించారు. ఆ బంధానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చినా, ఆశించిన మద్దతు లభించకపోవడంతో తీవ్ర నిరాశకు గురైనట్లు తెలిపారు. ఆ పరిస్థితి నుంచి బయటపడటానికి చాలా కాలం పట్టిందని చెప్పారు. ప్రస్తుతం తాను ఒంటరిగా ఉంటూ, పూర్తిగా తన పనిపైనే దృష్టి పెట్టినట్లు స్పష్టం చేశారు. కెరీర్ విషయానికి వస్తే, చాలా చిన్న వయసులోనే సినీ రంగంలోకి అడుగుపెట్టిన రెజీనా దాదాపు ఇరవై సంవత్సరాలు పూర్తిచేసుకున్నారు. గ్లామర్, నటన పరంగా తనను తాను నిరూపించుకున్నప్పటికీ, అగ్ర కథానాయిక స్థానం మాత్రం అందుకోలేకపోయారు. వివిధ భాషల్లో అవకాశాలు కోసం ప్రయత్నిస్తూ తన ప్రయాణాన్ని కొనసాగించిన ఆమె, ప్రస్తుతం తమిళ చిత్రాలపై దృష్టి సారించారు. కొన్ని కొత్త ప్రాజెక్టులతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. తన అనుభవాల ద్వారా జీవితం ఇచ్చిన పాఠాలను నేర్చుకుంటూ తెలిపార్లు.

# సల్మాన్‌వంశీ సినిమా ప్రారంభం





**వేద న్యూస్ డెస్క్:**

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, టాలీవుడ్ దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ చిత్రం నేడు అధికారికంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ రూపొందుతోంది. ఈ చిత్రాన్ని అగ్ర నిర్మాత దిల్‌రాజు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ కాంబినేషన్‌పై భారీ అంచనాలు నెలకొనగా, షూటింగ్ ప్రారంభం కావడంతో సినీ వర్గాల్లో మరింత ఆసక్తి పెరిగింది. ఈ సినిమాలో కథానాయికగా నయనతార నటిస్తున్నారు. ఆమె చేరికతో ఈ ప్రాజెక్ట్‌కు మరింత క్రేజ్ వచ్చింది. యాక్షన్, భావోద్వేగాలు కలగలిపిన కథతో ఈ చిత్రం రూపొందనుందని సమాచారం. సల్మాన్ ఖాన్, వంశీ పైడిపల్లి కలిసి పని చేయడం ఇదే మొదటిసారి కావడం విశేషం. పాన్-ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం దేశవ్యాప్తంగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు పూర్తవగా, నేటి నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. ఈ భారీ చిత్రం 2027 మొదటి భాగంలో విడుదలయ్యే అవకాశముందని చిత్ర వర్గాలు వెల్లడించాయి.

# సూర్యజ్ఞానవేల్ మళ్లీ కలయిక.. భారీ అంచనాలు



**వేద న్యూస్ డెస్క్:**

దక్షిణాది స్టార్ హీరో సూర్య, దర్శకుడు జ్ఞానవేల్ మరోసారి కలిసి పని చేయనున్నట్లు సమాచారం వెలువడింది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన చిత్రం భారీ విజయాన్ని సాధించగా, ఇప్పుడు మరోసారి అదే జోడీ రిపీట్ కావడంతో సినీ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. సమాజంలోని అన్యాయాలపై గళమెత్తే కథలను ఎంచుకోవడంలో సూర్య ఎప్పుడూ ముందుంటారు. అలాంటి శక్తివంతమైన కథను దర్శకుడు జ్ఞానవేల్ సిద్ధం చేయగా, అది సూర్యకు నచ్చడంతో వెంటనే అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ చిత్రం కూడా సామాజిక అంశాలను స్పృశించే విధంగా ఉండనుందని సమాచారం. గతంలో వీరి కలయికలో వచ్చిన సినిమా ప్రేక్షకులతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ముఖ్యంగా అట్టడుగు వర్గాల సమస్యలను ప్రదర్శించిన విధానం విశేషంగా నిలిచింది. దీంతో ఈసారి కూడా అదే స్థాయిలో ప్రభావం చూపించే కథనే తెరకెక్కించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం సూర్య ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. అవి పూర్తయ్యిన తర్వాత ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ప్రారంభించే అవకాశముంది. ఇక దర్శకుడు జ్ఞానవేల్ కూడా ఇటీవల పెద్ద చిత్రాన్ని తెరకెక్కించి మంచి గుర్తింపు పొందారు. ఇప్పుడు సూర్యతో కలిసి మరో బలమైన కథను తెరపైకి తీసుకురావడానికి సిద్ధమవుతున్నారు. ఈ కాంబినేషన్‌లో రాబోయే కొత్త సినిమా గురించి మరిన్ని వివరాల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# విక్రమ్ బర్త్‌డే లుక్ వైరల్.. 60లోనూ యంగ్ స్టైల్

**వేద న్యూస్ డెస్క్:**

తమిళ సినీ నటుడు విక్రమ్ తన అరవైయవ పుట్టినరోజు సందర్భంగా మరోసారి అభిమానులను ఆశ్చర్యపరిచారు. తాజాగా బయటకు వచ్చిన వీడియోలో ఆయన యంగ్ లుక్‌తో కనిపించడం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కూలింగ్ గ్లాసెస్‌తో స్టైలిష్‌గా కనిపించిన విక్రమ్‌ను చూసి అభిమానులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ వయసులో కూడా ఇంత ఫిట్‌గా, యంగ్‌గా కనిపించడం ఎలా సాధ్యమైందో అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. విక్రమ్ సినీ ప్రయాణం ప్రారంభ దశలో సవాళ్లతో నిండి ఉంది. ప్రారంభంలో ఆయన నటించిన చిత్రాలు పెద్దగా విజయాలు సాధించకపోయినా, తరువాత వచ్చిన ఒక కీలక చిత్రం ఆయన కెరీర్‌ను పూర్తిగా మార్చింది. ఆ విజయంతో ఆయనకు తమిళ సినీ రంగంలో ప్రత్యేక స్థానం లభించింది. హీరోగా గుర్తింపు పొందే ముందు విక్రమ్ డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా కూడా పనిచేశారు. పలువురు ప్రముఖ నటులకు వాయిస్ అందించి అనుభవాన్ని సంపాదించారు. అనంతరం వరుస విజయాలతో స్టార్ హీరోగా ఎదిగారు. పాత్ర కోసం తన రూపాన్ని పూర్తిగా మార్చుకునే నటుడిగా విక్రమ్ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇప్పటికీ కొత్త కథలను ఎంచుకుంటూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆయన బర్త్‌డే లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానులను ఆకట్టుకుంటోంది.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073